క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. వైశాఖ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణ గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అమర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: దేశ రక్షణ కోసం వీరోచితంగా పోరాడి అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం ఘన నివాళులర్పించారు. జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ పాక్‌సైన్యం కాల్పుల్లో అమరుడైన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ చిత్రపటానికి సెంట్రల్ స్టోర్స్ సమీపంలోని యూనియన్ పాయింట్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, పి.వి. రమణమూర్తి, కొమ్ము ప్రసాదరావు, ఎస్.ఎ. నాయుడు, వెంకన్న, గోపాలరాజు, సుబ్బారావు, ఎన్. రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపాలు నర్సులు



స్టాఫ్ నర్సు అరుణను సత్కరిస్తున్న కరణంరెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రుల్లో చేరిన వారికి మేమున్నామని ధైర్యం చెప్పేవారే నర్సులని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదగంట్యాడ ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సు అరుణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సులు సేవామూర్తులని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, నాయకులు కిల్లాన ముసలయ్య, జి శంకరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలి మృతి



ఈశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న తోటి కార్మికులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి కేఎస్ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు ఈశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. అగనంపూడికి చెందిన తోటి కార్మికులు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకుడు జి.అప్పారావు మాట్లాడుతూ మృతురాలి మట్టి ఖర్చులు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

14న వాహనాల వేలం

కూర్మన్నపాలెం: వివిధ కారణాల వల్ల సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 14వ తేదీన వేలం వేయనున్నట్టు దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు తెలిపారు. పోలీసుస్టేషన్ ఆవరణలో ఆరోజు ఉదయం 11 గంటలకు గాజువాక తహసీల్దార్ శ్రీ వల్లి ఆధ్వర్యంలో వేలం వేస్తామని ఆయన పేర్కొన్నారు. చాలా కాలం నుంచి పోలీసు స్టేషన్‌లో ఎటువంటి రికార్డులు లేకుండా అనేక వాహనాలు విడిచిపెట్టటం జరిగిందని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు వేలం వేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని తమకు నచ్చిన వాహనాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు.

టైమ్ స్లాటు.. తల పోటు!



పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారులు



పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా తీసుకొచ్చిన విధానం క్రయ విక్రయదారులకు తలపోటుగా మారింది. స్లాట్ తీసుకున్న తర్వాత ఆ సమయానికి అక్కడికి వెళ్లాల్సిందే.. కొంచెం ఆలస్యమైనా.. దస్తావేజులు తప్పులున్నా మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సిందే.. దీని కోసం మరికొంత సమయంతో పాటు అదనపు వ్యయాన్ని భరించాల్సిందే.. ఈ విధానం క్రయ విక్రయదారులకు భారంగా మారింది.. అంతేకాకుండా రోజుకు కేవలం 39 స్లాట్లు మాత్రమే అందుబాటులో ఉండడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా తగ్గింది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా తగ్గింది.

గతంలో ఎన్ని వచ్చినా ఓకే

గతంలో ఎన్ని డాక్యుమెంట్లు ఉన్నా అన్నింటినీ రిజిస్ట్రేషన్ చేసేవారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానంలో రోజుకు స్లాట్ ద్వారా 39 దస్తావేజులను మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అవి కూడా పూర్తిగా అవ్వడం లేదని తెలుస్తోంది. పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు తగ్గాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతి రోజూ 60 నుంచి 80 వరకూ రిజిస్ట్రేషన్లు అయ్యేవి. ప్రత్యేక రోజుల్లో ఆ సంఖ్యకు 100కు పైగా ఉండేది.. కానీ ఆ సంఖ్య ఇప్పుడు సగానికి పైగా పడిపోయింది.

సమయం.. సొమ్ము వృథా

టైమ్‌స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత కేవలం పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. లేనిపక్షంలో ఆ స్లాట్ రద్దయిపోతుంది. మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాలంటే రూ.200 చెల్లించాలి. మూడో సారి అయితే రూ.500 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఫలితంగా క్రయ విక్రయదారులకు సమయం వృథా కావడంతో పాటు అదనపు ఆర్థిక భారం పడుతోంది.

గతంలో ఎప్పుడైనా అందుబాటులో..

గత ప్రభుత్వ హయాంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో టైమ్‌స్లాట్ విధానాన్ని 2020లో అమల్లోకి తీసుకొచ్చారు. క్రయ విక్రయదారులు తమ డాక్యుమెంట్లు తయారు చేయించుకొని వారికి అనువైన సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేలా పబ్లిక్ డేటా ఎంట్రీ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టైమ్‌స్లాట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గతంలో ఎప్పుడైనా టైమ్‌స్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని ఇప్పుడు కుదించారు.

రిజిస్ట్రేషన్లకు ఇక్కట్లు



కొత్తగా అమలు చేస్తున్న టైమ్‌స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్లకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గతంలో స్లాట్‌లు అన్‌లిమిటెడ్‌గా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ ఇప్పుడు లిమిటెడ్ స్లాట్‌లు పెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఈ విధానాన్ని వెంటనే మార్చేలా చర్యలు చేపట్టాలి.

– చెల్లుబోయిన నాయుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, నడుపూరు

ఎనీవేర్ సమయం పెంపుతో ఇక్కట్లు

గత ప్రభుత్వ హయాంలో ఎనీవేర్ డాక్యుమెంట్లకు కేవలం ఒక గంట సమయంలోనే అనుమతి లభించేంది. ఇప్పుడు ఆ సమయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం 48 గంటలకు పెంచింది. దీంతో ఎనీవేర్ డాక్యుమెంట్లు అనుమతి కోసం పంపించిన తర్వాత రెండు రోజుల పాటు వేచి చూడాల్సి వస్తోంది. దీంతో క్రయ విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.



రిజిస్ట్రేషన్లు తగ్గడంతో ఖాళీగా కుర్చీలు

గురుమూర్తిరెడ్డికి అభినందనలు



గురుమూర్తిరెడ్డిని సత్కరిస్తున్న 87వ వార్డు నాయకులు

కూర్మన్నపాలెం: రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా నియమితులైన తిప్పల గురుమూర్తిరెడ్డిని సోమవారం 87వ వార్డు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. అనంతరం గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపురాము, దామెదర్, దానప్పలు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఏబీఎఫ్‌కి వడ్డీ రేటు కొనసాగించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పీఎఫ్ వల్లే సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఏబీఎఫ్)కు వడ్డీ రేటు కొనసాగించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు స్టీల్‌ప్లాంట్ సీఎండీకి సోమవారం లేఖ అందజేశారు. 1995లో ఎస్ఏబీఎఫ్ ప్రవేశపెట్టడం జరిగిందని అప్పటి నుంచి పీఎఫ్ వలే ఎస్ఏబీఎఫ్‌కి కూడా వడ్డీ చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. వివిధ బ్యాంకులకు కంపెనీ 14 శాతం వడ్డీ చెల్లిస్తుందన్నారు. అయితే ఉద్యోగుల ఎస్ఏబీఎఫ్‌కి 7.25 శాతం వడ్డీ చెల్లించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని పీఎఫ్ వలే 8.25 శాతం వడ్డీ కొనసాగించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్షులు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

బుద్ధుని బోధలు అనుసరణీయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: బుద్ధుని బోధలు అనుసరణీయమని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో బుద్ధ పూర్ణిమ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ బోర వేణుగోపాల్ గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బుద్ధ వందనం, దమ్మ సందేశం, దమ్మ దీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శంకరనారాయణ, రంభ నారాయణమూర్తి, స్థానికులు కె. అన్నవరం, మట్టా కృష్ణ, బోర రోజా, సుజాత, శ్రీలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలేశుడి పల్లకీ ఉత్సవం



తిరుమాఢ వీధిలో పల్లకిలో ఊరేగుతున్న శ్రీనివాసుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశునికి పల్లకీ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదలకు చీరల వితరణ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: పేదలకు సాయం చేయడం అభినందనీయమని గాజువాక మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు అండిబోయిన అప్పారావు దంపతుల పెళ్లి రోజు పురస్కరించుకుని సోమవారం వినాయకనగర్‌లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ చైర్ పర్సన్ బొక్క సత్యనారాయణ, నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, చింతపల్లి రాంబాబు, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదమణి తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- పొంగి పొర్లిన గెడ్డలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



చెరువును తలపిస్తున్న వినాయకనగర్ ప్రధాన రహదారి



వుడాకాలనీ స్మార్ట్ ఎదురుగా రోడ్డుపైకి వచ్చిన వరదనీరు



టింపనీ పాఠశాల సమీపంలో కాలువల్లో మురుగు నీరు రోడ్లపైకి..

పెదగంట్యాడ: మండు వేసవిలో అకాల వర్షం దంచికొట్టింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఏకధాటిగా, ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు జనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.. గెడ్డలు, కాలువలు పొంగి పొర్లాయి.. రహదారులన్నీ చెరువులను తలపించాయి. సాయంత్రం సమయంలో ఆకాశంలో మబ్బులు మొదలయ్యాయి. ఆ తర్వాత చిన్నగా వర్షం ప్రారంభమైంది. అటుపై ఏకధాటిగా కురిసింది. సుమారు రెండుగంటలు ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. వుడాకాలనీలో స్మార్ట్ ఎదురుగా మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోయారు.

కూలిన డాబా ఇల్లు

సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జీవీఎంసీ 75వ వార్డు సీతానగరంలో నమ్మి సింహాచలం అనే వ్యక్తి డాబా ఇల్లు ముందు భాగం కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.



వర్షానికి కూలిన ఇంటి ముందు భాగం

నర్సుల సేవలు మరువలేం



కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

అగనంపూడి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. తర్వాత కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. మదర్ థెరిసా, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి వారి సేవల వల్ల నర్సులకు మంచి గుర్తింపు వచ్చిందని నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి అన్నారు. కరోనా రోజుల్లో నర్సులు వైద్యులతోపాటు ప్రాణాలొడ్డి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రామాలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న వెంకట్రావు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి 79వ వార్డు జూబిలీహిల్స్‌కు చెందిన గొల్లవిల్లి వెంకటరావు, కనక భవాని దంపతులు రూ.10,116 నగదును సోమవారం ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, గంతకోరు అప్పారావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మడగల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



అగనంపూడి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దశేంద్ర

అగనంపూడి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదినోత్సవం సందర్భంగా 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో అగనంపూడి ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముందుగా సంపత్ వినాయక ఆలయంలో పూజలు, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, డాక్టర్ గోపీకృష్ణ, పరిపాలనాధికారి రవిరాజు, నాయకులు కరణం సత్యారావు, డొక్కా రమేష్, దాసరి త్రినాథ్, బాబ్జి, కోసూరి తాతారావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కమిటీలో గాజువాక నాయకులు



కసిరెడ్డి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి

గాజువాక: సీపీఐ జిల్లా కమిటీలో గాజువాక నాయకులకు చోటు లభించింది. నగరంలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లా మహాసభల సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో గాజువాక ప్రాంతానికి చెందిన కసిరెడ్డి సత్యనారాయణ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కె.వనజాక్షి, కె.అచ్యుతరావు, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, కె.పోతయ్య, పి.సూర్యపద్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సీపీఐ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



పవన్ కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్ షిప్‌కు చెందిన ఓ వ్యక్తి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలిలా.. స్టీల్‌ప్లాంట్ సెక్టార్ 18లో నివసిస్తున్న పవన్ కుమార్ భార్యను హింసించడంతో ఆమె ఆదివారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు పవన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరలా సోమవారం స్టేషన్‌కు రావాలని పవన్ కుమార్‌కు సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం ఆయన భార్య జోష్న పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే సోమవారం పవన్‌కుమార్ స్టేషన్‌కు హాజరు కాలేదు. మొబైల్‌కు చేస్తే స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో చుట్టుపక్కల వెతకగా పవన్ కుమార్ ఆచూకీ తెలియక పోవడంతో ఆమె స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి చంద్రకళ

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం చెట్లు నాటాల్సిన అవసరాన్ని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ వివరించారు. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ అంశాలపై విద్యార్థులతో గ్రూప్ చర్చ నిర్వహించి అనంతరం వారికి క్విజ్ పోటీ నిర్వహించారు.